సాక్షి
నంద్యాల
బుధవారం ¦ 13 ¦ డిసెంబర్ ¦ 2023



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయప్రాంగణంలోని శనగల బసవన్న, బయలువీరభద్ర స్వామికి మంగళవారం అర్చకులు విశేష పూజలు నిర్వహించి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించారు.



సుంకేసులకు నిలిచిన ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు ఎగువ నుంచి ఇన్ ఫ్లో నిలిచి పోయింది. డ్యాంలో నుంచి మంగళవారం కాల్వకు 221 క్యూ సెక్కుల నీరు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.



ఉత్సవాలకు రూ. 10.53 కోట్లు

శ్రీశైలంటెంపుల్: మల్లన్న సన్నిధిలో శివరాత్రి ఉగాది ఉత్సవాల నిర్వహణ పనులు రూ. 10.53 కోట్లతో చేపట్టాలని మంగళవారం ధర్మకర్తల మండలి నిర్ణయించింది.

8లో▸


న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా శశికళారెడ్డి



నంద్యాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నంద్యాలకు చెందిన ఏపీఎస్పీడీసీఎల్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ శశికళారెడ్డి నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేసింది. అదే విధంగా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా తస్లీమాను నియమించారు.

కృష్ణమ్మకు నదీ హారతి



హారతి ఇస్తున్న ఆలయ అర్చకులు

కొత్తపల్లి: సప్తనది సంగమ ప్రాంతంలో వెలసిన ప్రాచీన సంగమేశ్వరంలో మంగళవారం కార్తీకమాస పూజలు నిర్వహించారు. కార్తీక మాస అమావాస్య సందర్భంగా కృష్ణాతీరంలో నదీజలాలకు ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ భక్తులతో కలసి హారతి ఇచ్చారు. అంతకు మునుపు వేపధారు శివలింగానికి విశేష పూజలు చేశారు.

చేనేతకారులకు 15 శాతం సబ్సిడీపై నూలు

కర్నూలు(అగ్రికల్చర్): చేనేత సహకార సంఘాల్లో లేని చేనేతకారులకు 15 శాతం సబ్సిడీపై నూలు సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందుకు వ్యక్తిగతంగా పాసు పుస్తకాల జారీకి ప్రతిపాదనలు పంపుతున్నట్లుగా ఉమ్మడి జిల్లా చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు హరికృష్ణ మంగళవారం విలేకర్లకు తెలిపారు. కర్నూలు జిల్లాలో 553 మందికి, నంద్యాల జిల్లాలో 100 మంది చేనేతకారులకు వ్యక్తిగతంగా పాసుపుస్తకాలు జారీ చేయడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ఆశలన్నీ కేంద్ర బృందంపైనే!

- 2023–24లో ఉమ్మడి జిల్లాలో కరువు పరిస్థితులు
- కర్నూలు జిల్లాలో 24, నంద్యాల జిల్లాలో 6 మండలాలు కరువు ప్రాంతాలుగా గుర్తింపు
- జూన్ నుంచి డిసెంబరు వరకు కేవలం రెండు నెలల్లోనే అధిక వర్షాలు
- సాధారణ వర్షపాతం 548.3 మి.మీ.. కురిసింది 352 మి.మీ మాత్రమే
- ఖరీఫ్‌తో పాటు రబీ పంటలపై కూడా తీవ్ర ప్రభావం
- నేడు జిల్లాలో సెంట్రల్ టీమ్ పర్యటన



కోడుమూరు సమీపంలో వర్షాభావంతో దెబ్బతిన్న పత్తి పంట

కర్నూలు(అగ్రికల్చర్): రైతుల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రకృతి సహకరించక పోవడంతో 2023–24లో ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులు నష్టాలు మూట కట్టుకున్నారు. వాతావరణ మార్పుల కారణంగా ఏడాదంతా వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో మొదటి సారిగా అనావృష్టి పరిస్థితులు ఏర్పడి రైతులు నష్టపోయారు. కర్నూలు జిల్లాలో 24 మండలాలు, నంద్యాల జిల్లాలో 6 మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించింది. పంట నష్టంపై ఎన్యూమరేషన్ కూడా చేపట్టి ఉమ్మడి జిల్లాకు ఇన్‌పుట్ సబ్సిడీ కోసం రూ.456.63 కోట్లతో నివేదిక కూడా ప్రభుత్వానికి పంపారు. కర్నూలు జిల్లాలో తుగ్గలి, కర్నూలు రూరల్, నంద్యాల జిల్లాలో ప్యాపిలి, డోన్ మండలాల్లోను కరువు తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ కొన్ని గణాంకాల వల్ల వాటిని కరువు మండలాల జాబితాలోకి చేర్చలేదు. ఈ మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించేందుకు ఆయా జిల్లా కలెక్టర్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. బుధ, గురువారాల్లో ఉమ్మడి జిల్లాలో పర్యటించే సెంట్రల్ టీమ్‌పై రైతాంగం ఆశలు పెట్టుకుంది. టీమ్ దృష్టికి జిల్లా కరువు పరిస్థితిని కళ్లకు కట్టినట్లు చూపించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లా కలెక్టర్ సృజన, జేసీ నారాపురెడ్డి మౌర్య ఆధ్వర్యంలో సెంట్రల్ టీమ్‌కు ఇచ్చే నివేదికను సిద్ధం చేసింది. ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా కరువు తీవ్రతను కూడా వివరించనున్నారు. ఆయా నియోజక వర్గాల శాసనసభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు కూడా కరువు ప్రభావంతో ప్రజలు పడుతున్న కష్ట, నష్టాలను వారి దృష్టికి తీసుకెళ్లనున్నారు. కేంద్ర బృందం నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే నిధులతో రాష్ట్ర ప్రభుత్వం రైతులను మరింత ఆదుకోనుంది.

రెండు నెలల్లోనే అధిక వర్షాలు

ఖరీఫ్ సీజన్ జూన్ నుంచి సెప్టెంబర్ వరకు ఉంటుంది. అక్టోబరు నుంచి మార్చి వరకు రబీ, లేట్ రబీ సీజన్లు ఉంటాయి. జూన్ నుంచి డిసెంబరు నెల వరకు పరిశీలిస్తే జూలై, అక్టోబరు నెలల్లో మాత్రమే అధిక వర్షాలు కురిశాయి. మిగిలిన అన్ని నెలల్లో వర్షాలు అంతంత మాత్రానికే పరిమితం కావడం గమనార్హం. వర్షాలు తక్కువ కావడంతో భూగర్భ జలాలు కూడా పడిపోతున్నాయి. 2022 నవంబరులో భూగర్భ జలాలు 4.84 మీటర్లలో ఉండగా 2023 నవంబర్‌లో 7.80 మీటర్ల లోతుకు పడిపోయాయి. దీన్ని బట్టి చూస్తే రానున్న రోజుల్లో నీటి సమస్య మరింత ఎక్కువగా ఉండే ప్రమాదం కనిపిస్తోంది.

3.88 లక్షల హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు

2023–24 ఖరీఫ్‌లో వ్యవసాయ, ఉద్యాన పంటలు 3,88,911 హెక్టార్లలో 33 శాతం పైగా దెబ్బతిన్నట్లు ఆయా శాఖల అధికారులు ప్రాథమిక నివేదిక రూపొందించారు. వ్యవసాయ శాఖకు సంబంధించి 3,32,714 హెక్టార్లు, ఉద్యానశాఖకు సంబంధించి 56,810 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. గతంలో ఎంత కరువు ఉన్నా రైతులకు 50 శాతం పంట దక్కేది. ఈ ఏడాది మాత్రం 20 శాతం కూడా పంట దక్కకపోవడం రైతులను ఆందోళన కలిగిస్తోంది. ఉద్యాన శాఖలో టమాట, ఉల్లి, పచ్చిమిరప, ఎండు మిరపపై వర్షాభావం ఎక్కువగా ఉంది. వ్యవసాయ శాఖకు సంబంధించి దాదాపు అన్ని పంటలపై కూడా ఈ ప్రభావం ఉన్నట్లు స్పష్టమవుతోంది. కరువు ప్రాంతంగా గుర్తించని తుగ్గలిలో 57,694 ఎకరాల్లో, కర్నూలు రూరల్ మండలంలో 25 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి.

రబీ కూడా చేతికందనట్లే..

వర్షాభావం ప్రభావంతో జిల్లాలో రబీ పంటలపై కూడా రైతులు ఆశలు వదులుకున్నారు. సెప్టెంబరులో విస్తారంగా వర్షాలు కురిస్తేనే రబీ సాగుతుంది. ఈ సారి సెప్టెంబరులో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉండటంతో రబీ సాగు ముందుకు కదల్లేదు. రబీ సాధారణ సాగు 1.21 లక్షల హెక్టార్లు కాగా 63,009 హెక్టార్లలో మాత్రమే విత్తనం వేశారు. అయితే భూమిలో తేమ లేకపోవడంతో రబీ పంటలు చాలా వరకు దెబ్బతిన్నాయి. అటు ఖరీఫ్, ఇటు రబీ సీజన్‌లపై వర్షాభావం ప్రభావం తీవ్రంగా ఉండటంతో అన్నదాతల్లో అంతులేని ఆందోళన గూడు కట్టుకుంది.

కర్నూలు జిల్లాలో వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.

నెల	సాధారణ వర్షపాతం	నమోదైన వర్షపాతం
జూన్	77.7	51.7
జూలై	90.7	137.4
ఆగస్టు	116.2	26.6
సెప్టెంబరు	116.5	90.2
ఖరీఫ్ మొత్తం	401.1	305.9
అక్టోబరు	110.2	1.1
నవంబరు	29	49
డిసెంబరు	8	1.8
రబీ మొత్తం	147.2	46.1
మొత్తం	548.5	352.0

రేపు నంద్యాల జిల్లాలో..

నంద్యాల జిల్లాలో బేతంచెర్ల, బనగానపల్లె, గడివేముల, మిడుతూరు, పగ్యిడాల, పాణ్యం మండలాలను కరువు ప్రాంతాల జాబితాలో చేర్చారు. జిల్లాలో సెంట్రల్ టీమ్ ఈ నెల 14న బేతంచెర్ల, మిడుతూరు, పగిడ్యాల మండలాల్లో పర్యటించి కరువు తీవ్రతను పరిశీలించడంతో పాటు రైతులతో ముఖాముఖీ కానుంది. ఇప్పటి వరకు కరువు ప్రాంతాలుగా గుర్తించిన ఆరు మండలాల్లో 22,812 హెక్టార్లలో పంటలు దెబ్బతినగా.. ఇన్‌పుట్ సబ్సిడీ కోసం రూ.26.87 కోట్లతో నివేదిక పంపారు. ఈ క్రమంలో డోన్, ప్యాపిలి మండలాల్లోని కరువు తీవ్రతను సెంట్రల్ టీమ్ దృష్టికి తీసుకపోవడానికి ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం రంగం సిద్ధం చేసింది. ప్యాపిలి మండలంలో 46 వేల ఎకరాలు, డోన్ మండలంలో 35 వేల ఎకరాల్లో పంటలు 33 శాతంపైగా దెబ్బతిన్నాయి. ప్రధానంగా వేరుశనగ, ఆముదం, కంది పంటలు వర్షాభావం వల్ల దెబ్బతిన్నాయి.



ప్యాపిలి సమీపంలో ఎండిన వేరుశనగ పంట

కరువు తీవ్రతను సెంట్రల్ టీమ్ దృష్టికి తీసుకెళ్తాం



జిల్లాలో నెలకొన్న కరువు తీవ్రతను సెంట్రల్ టీమ్ దృష్టికి తీసుకెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. బుధవారం ఉదయం అనంతపురం నుంచి సెంట్రల్ టీమ్ ప్రతినిధులు పత్తికొండ మండలానికి చేరుకుంటారు. పత్తికొండ, ఆస్పరి, ఆదోని, ఆలూరు, దేవనకొండ, కోడుమూరు మండలాల్లోని కరువు పరిస్థితులను కేంద్ర బృందం సభ్యులు పరిశీలిస్తారు. రైతులతో ముఖాముఖీ అవుతారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసే ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తారు. తుగ్గలి, కర్నూలు రూరల్ మండలాలను కూడా కరువు మండలాలుగా గుర్తించేందుకు నివేదికలు పంపాం. ఈ రెండు మండలాల కరువు పరిస్థితులను కూడా సెంట్రల్ టీమ్ దృష్టికి తీసుకెళ్తాం. గురువారం కూడా జిల్లాలోని ఒకటి, రెండు మండలాల్లో సెంట్రల్ టీమ్ పర్యటించే అవకాశం ఉంది.

– డాక్టర్ జి.సృజన, కర్నూలు జిల్లా కలెక్టర్

తుగ్గలి మండలాన్ని కరువు ప్రాంతంగా గుర్తించాలి



పత్తికొండ నియోజకవర్గంలోని తుగ్గలి మండలంలో కూడా తీవ్రమైన కరువు పరిస్థితులు ఉన్నాయి. ఈ మండలాన్ని కొన్ని గణాంకాల కారణంగా కరువు ప్రాంతంగా గుర్తించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. మాకు 9 ఎకరాల భూమి ఉండగా 5 ఎకరాల్లో వేరుశనగ, 4 ఎకరాల్లో కంది సాగు చేశాం. వేరుశనగ వర్షాభావంతో పూర్తిగా దెబ్బతినింది. ఎకరాకు 50 కిలోల దిగుబడి కూడా రాలేదు. కందిలో ఎకరాకు క్వింటా మాత్రమే దిగుబడి వచ్చే అవకాశం ఉంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ సారి నష్టపోయాం. తుగ్గలి మండలం జరిగిన పంట నష్టాన్ని కూడా సెంట్రల్ టీమ్ దృష్టికి తీసుకుపోతాం. ఈ మండలాన్ని కూడా కరువు ప్రాంతంగా గుర్తించి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది.

– నారాయణనాయక్, జొప్లాతండా, తుగ్గలి మండలం

ముస్లింల సంక్షేమమే ధ్యేయం



పాదయాత్ర చేస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, చిత్రంలో జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి

- ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి
- ప్యాపిలిలో అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి

ప్యాపిలి: ముస్లింల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ప్యాపిలి పట్టణంలో రూ. 16 కోట్లతో నిర్మించిన నాలుగు లైన్ల రహదారి, రూ. 67 లక్షలతో ఆధునికీకరించిన ఆర్టీసీ బస్టాండ్, రూ. 30 లక్షలతో ఆధునికీకరించిన షాదీఖానా భవనాలను జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలసి ప్రారంభించారు. ముందుగా ప్యాపిలి బైపాస్ రోడ్డు వద్ద ఆర్థికమంత్రికి స్థానిక మహిళలు అధిక సంఖ్యలో హాజరై ఘనస్వాగతం పలికారు. అనంతరం మంత్రి రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మహిళలతో కలిసి దాదాపు 6 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు. మార్గమధ్యలో ఆధునికీకరించిన షాదీఖానా, ఆర్టీసీ బస్టాండ్‌ను మంత్రి ప్రారంభించారు. షాదీఖానా కమిటీ సభ్యులు మస్తాన్ ఖాన్ తదితరులు మంత్రిని ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ముస్లిల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముస్లిం మైనారిటీల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో శిథిలావస్థలో ఉన్న షాదీఖానాకు ఆధునిక సౌకర్యాలు కల్పించామన్నారు. జలదుర్గం గ్రామంలో కోటి రూపాయల వ్యయంతో షాదీఖానా పనులు చేపడుతున్నామని తెలిపారు. జగనన్న పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంక్షేమ పథకాలతో లబ్ధి పొందుతూ సంతోషంగా జీవిస్తున్నారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ నేతలు ప్రజలను పక్కదోవ పట్టించే హామీలు ఇస్తున్నారని మంత్రి విమర్శించారు. టీడీపీ ప్రలోభాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం మంత్రి వెంగళాంపల్లి వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను, కొత్తకోట వద్ద నిర్మిస్తున్న డ్రైవింగ్ స్కూల్ పనులను మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, జెడ్పీటీసీ సభ్యులు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొర్రా మల్లికార్జునరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి, ఉప సర్పంచ్ గడ్డం భువనేశ్వర్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు బోరెడ్డి రాము, ఆలేబాదు బాలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు దిలీప్ చక్రవర్తి, కమతం భాస్కర్ రెడ్డి, రామచంద్రరెడ్డి, రాజామురళి, శ్రీనివాసరెడ్డి, బషీర్, సోమశేఖర్, కొండయ్య, మస్తాన్ ఖాన్, షాషా, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



షాదీఖానాలో మంత్రి బుగ్గనను సన్మానిస్తున్న ముస్లింలు

ఉజ్వల భవితకు జగనే దిక్సూచి

- సీఎం జగనన్న పాలనపై విద్యార్థుల హర్షాతిరేకం
- గోరుముద్ద, విద్యాకానుక, విద్యా, వసతి దీవెన భేష్ అంటూ కితాబు
- నంద్యాల విద్యా సాధికార ర్యాలీకి విశేష స్పందన
- వేల సంఖ్యలో తరలివచ్చిన ఇంటర్, డిప్లొమా, డిగ్రీ విద్యార్థులు
- ఏపీకి మళ్లీ సీఎం జగనన్నే కావాలంటూ నినాదాలు



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి సంఘం నాయకులు



ర్యాలీకి భారీగా తరలివచ్చిన విద్యార్థులు



ర్యాలీలో ప్లకార్డుతో విద్యార్థిని

సాక్షి, నంద్యాల: పేద విద్యార్థులకు ఉన్నత చదువులు అందాలంటే సీఎంగా వైఎస్ జగన్ ఉండాలని విద్యార్థిలోకం నినదించింది. తమ ఉజ్వల భవితకు జగన్ మాత్రమే దిక్సూచిగా నిలుస్తున్నారని విద్యార్థులు కొనియాడారు. పేద విద్యార్థులకు ఇంగ్లిష్ విద్యను అందించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలో వేలాది మంది విద్యార్థులతో విద్యా సాధికార ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులంతా జై జగన్.. జై జై జగన్ అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో స్థానిక పద్మావతినగర్‌లోని జ్యోతిబా పూలే విగ్రహం నుంచి శ్రీనివాస్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వరకు భారీ ర్యాలీ సాగింది. ఇంటర్, డిప్లొమా, డిగ్రీ చదువుతున్న సుమారు రెండు వేల మంది విద్యార్థిని, విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. సీఎం వైఎస్ జగన్ పాలనలోనే తమకు విద్యా దీవెన, వసతి దీవెన సక్రమంగా అందుతున్నాయన్నారు. చదువుతోనే బంగారు భవిష్యత్ సాధ్యమని నమ్మిన సీఎం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్ జగన్‌నే గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

విద్యా రంగానికి పెద్దపీట

వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి విద్యా రంగంలో సమూల మార్పులు తీసుకొచ్చారు. విద్యార్థుల సంక్షేమం కోసం విద్యా కానుక, వసతి దీవెన కార్యక్రమాలను ఏటా అమలు చేస్తున్నారు. బడికి వెళ్లే విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలని గోరు ముద్ద కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాలలు, సాంఘిక, సంక్షేమ వసతి గృహాలను నాడు – నేడు కార్యక్రమంతో అద్భుతంగా తీర్చిదిద్దుతున్న ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుంది.

– సురేష్ యాదవ్, వైఎస్సార్ సీపీ స్టూడెంట్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు, నంద్యాల

అమ్మ ఒడితో చదువుల కొనసాగింపు



రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాభివృద్ధికి విశేష కృషి చేస్తోంది. ప్రతి ఏడాది బడ్జెట్‌లోనూ విద్యారంగానికి కేటాయింపులు పెంచుకుంటూ పోతోంది. ఇంటర్ విద్యార్థులకు అమ్మ ఒడి ఇవ్వడం ద్వారా పదో తరగతి తర్వాత కూడా చదువుకునే విద్యార్థుల సంఖ్య గతంతో పోలిస్తే పెరిగింది. ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్, వసతి దీవెన సక్రమంగా అందుతున్నాయి.

– దస్తగిరి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, నంద్యాల

పాఠశాలల్లో విప్లవాత్మక మార్పులు



ప్రభుత్వ బడుల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. మేము పాఠశాల విద్య చదువుతున్న సమయంలో ప్రభుత్వ బడుల్లో మరుగుదొడ్లు కూడా ఉండేవి కావు. ఇప్పుడు బాలికలకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. నాడు – నేడులో స్కూళ్లను అందంగా తీర్చిదిద్దుతున్నారు. కంప్యూటర్ విద్యను కూడా పాఠశాల స్థాయి నుంచే బోధిస్తుండడంతో పై చదువులకు వెళ్లినప్పుడు తోడ్పడుతుంది.

– ప్రమిక, గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ, నంద్యాల

చదువు పూర్తికాగానే ఉద్యోగాలు వస్తున్నాయి



డిగ్రీ పూర్తి చేసిన తర్వాత ఏం చదవాలో అర్థం అయ్యేది కాదు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి నియోజకవర్గానికి స్కిల్ హబ్‌లను ఏర్పాటు చేయడంతో డిగ్రీ పూర్తవగానే అక్కడే ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. నాకు తెలిసిన వారు అక్కడే శిక్షణ తీసుకుని ఇప్పుడు ఉద్యోగాలు చేస్తున్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు శిక్షణ కోసం హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలకు వెళ్లే భారం తప్పుతోంది.

– అంజి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నంద్యాల



ఉత్సవమూర్తులకు తిరుమంజనం నిర్వహిస్తున్న దృశ్యం

శాస్త్రోక్తంగా అమావాస్య ఉత్సవం

ఆళ్లగడ్డ: అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో అమావాస్యను పురస్కరించుకుని మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున మూలమూర్తులను సుప్రభాతసేవతో మేలుకొలిపి దివ్యదర్శనం అనంతరం నిత్యపూజలు నిర్వహించారు. ఆతర్వాత ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను ఆలయ ముఖద్వార మండపంలో కొలువుంచి పంచామృతాలతో అభిషేకించి వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య దూపదీపాలతో మహా మంగళహారతి అందించారు. రాత్రి విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు పల్లకీపై కొలువుదీరి తిరువీధిలో విహరించారు.

క్లుప్తంగా

దుప్పి మాంసం స్వాధీనం



నిందితుడి అరెస్ట్ చూపుతున్న అటవీ అధికారులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని నాగలూటి చెంచుగూడెంకు చెందిన గుల్ల బంటి ఈదన్న అనే వ్యక్తి నుంచి దుప్పి మాంసాన్ని అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నాగలూటి రేంజర్ దొరస్వామి తెలిపిన వివరాల మేరకు.. అటవీ అధికారుల సమాచారం మేరకు మంగళవారం నాగలూటి రేంజ్‌లోని లింగమయ్య కుంట ప్రాంతంలో అటవీ సిబ్బంది తనిఖీ చేపట్టడగా గుళ్ల బంటి ఈదన్న అనే వ్యక్తి 35 కేజీల దుప్పి మాంసం, దుప్పి తల, చర్మంతో పట్టుబడ్డాడు. మరో నిందితుడు గుళ్ల బంగి గురవయ్య తప్పించుకుని పరారయ్యాడు. పట్టుబడిన నిందితుడు బంటి ఈదన్నను కోర్టులో హాజరు పరుచగా జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. లింగమయ్య కుంట వద్ద ఉచ్చులు వేయడం ద్వారా నిందితులు దుప్పిని వధించి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. దాడుల్లో డీఆర్‌వో రత్నప్రభావతి, ఎఫ్‌బీవోలు ముర్తుజావలి, ఎస్ రజాక్ పాల్గొన్నారు.

రూ.2.90 లక్షలు అపరాధ రుసుం వసూలు

కర్నూలు (న్యూటౌన్): అక్రమంగా గ్రావెల్, గ్రానైట్ తరలించి పట్టుబడిన వాహన యజమానుల నుంచి అపరాధ రుసుంగా రూ.2.90 లక్షలు వసూలు చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సి. బెళగల్ మండలం బ్రాహ్మణదొడ్డిలోని సర్వే నంబర్ 550/డీ1లో అక్రమ గ్రావెల్ తవ్వకాలు చేసిన సలీం నుంచి రూ.1 లక్ష అపరాధ రుసుం విధించి వసూలు చేశామన్నారు. అలాగే ప్రకాశం జిల్లా నుంచి తాడిపత్రికి అక్రమంగా గ్రావెల్ రవాణా చేస్తూ పట్టుబడిన కుమార్ నుంచి రూ.1.55 లక్షలు, తడకనపల్లె నుంచి గ్రావెల్ అకమ్రంగా రవాణా చేస్తూ పట్టుబడిన టిప్పర్ యజమాని చాంద్ బాషా నుంచి రూ.35 వేలు జరిమానా వసూలు చేసినట్లు వెల్లడించారు.

గుర్తు తెలియని వృద్ధురాలి ఆత్మహత్య



వృద్ధురాలి మృతదేహం

బనగానపల్లె రూరల్: నందవరం – బనగానపల్లె గ్రామాల మధ్య ఉన్న రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. నంద్యాల రైల్వే ఎస్‌ఐ ఎస్ అబ్దుల్ జలీల్ తెలిపిన వివరాల మేరకు.. సుమారు 60–65 ఏళ్ల వయస్సు ఉన్న వృద్ధురాలు సోమవారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. ఉదయం స్థానికులు సమాచారం ఇవ్వడంతో రైల్వే పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలికు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించపోవడంతో శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలు వివరాలు తెలిసిన వారు నంద్యాల రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ తెలిపారు.

➤ దుస్తులు ఇస్త్రీ చేస్తున్న ఈమె పేరు సంజమ్మ, సొంతూరు డోన్ దగ్గర చింతలపేట అయితే 30 ఏళ్ల క్రితం బతుకుదెరువుకు కర్నూలు చేరుకుని రజక వృత్తిపైనే జీవిస్తున్నారు. తొలుత ఇస్త్రీ పెట్టె, బొగ్గులు, డ్రమ్ములు కొనుక్కునేందుకు చాలా ఇబ్బంది పడేవాళ్లు. ప్రస్తుతం సీఎం జగన్ కుల వృత్తిపై ఆధారపడిన వారికి ఏడాదికి రూ.10 వేలు ఉచితంగా అందిస్తుండటంతో ఈమెకు నాలుగు సార్లు రూ.10 వేల ప్రకారం రూ.40 వేలు వచ్చాయి. ఈ దబ్బులతో రెండు ఇస్త్రీ పెట్టెలు రెండు డ్రమ్ములు, ఇతరత్రా ముడి సరుకులు తెచ్చుకొని సాఫీగా కులవృత్తిని సాగిస్తున్నట్లు సంజమ్మ పేర్కొన్నారు.



➤ సెలూన్ నిర్వహిస్తున్న ఈ వ్యక్తి పేరు వి. సాయి కుమార్. నగరంలోని అబ్బాస్‌నగర్‌లో దుకాణం. జగనన్న చేదోడు పథకం ప్రారంభమైనప్పటి నుంచి నాలుగు విడతలుగా ఏడాదికి రూ.10 వేల ప్రకారం రూ.40 వేలు ఆయన బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. ఈ నగదుతో ఆయన సెలూన్‌కు అవసరమైన చైర్స్, ఇతరత్రా అవసరమైన వస్తువులు కొనుగోలు చేశారు. ముఖ్యమంత్రి జగన్ అందిస్తున్న ఆర్థిక సహకారం ద్వారా షాపును మరింత అభివృద్ధి చేసుకునేందుకు అవకాశం ఏర్పడిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



చేతి వృత్తులకు 'చేదోడు'!

- నిరంతరాయంగా నాలుగు విడతలుగా ఆర్థిక సహాయం
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.101.48 కోట్లు జమ
- కరోనా కష్టకాలంలో కూడా అందిన సాయం
- చిరు సాయంతో వేలాది కుటుంబాలకు స్వాంతన
- ఆనందం వ్యక్తం చేస్తున్న రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లు

నాలుగు విడతలుగా విడుదలైన నిధుల వివరాలు ...

కేటగిరీ	లబ్ధిదారుల సంఖ్య	జమ అయిన మొత్తం (రూ.కోట్లలో)
కర్నూలు జిల్లా ...		
టైలర్లు	25,957	రూ.25.957
రజకులు	13,979	రూ.13.979
నాయీ బ్రాహ్మణులు	9,878	రూ.9.878
మొత్తం:	49,814	రూ.49.814
నంద్యాల జిల్లా ...		
టైలర్లు	15,008	రూ.15.008
రజకులు	24,999	రూ.24.999
నాయి బ్రాహ్మణులు	11,661	రూ.11.661
మొత్తం:	51,668	రూ.51.668

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'జగనన్న చేదోడు' తో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వేలాది కుటుంబాలు తమ జీవనోపాధిని మెరుగుపరుచుకుంటున్నాయి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చేతి వృత్తులతో జీవనం గడుపుతున్న టైలర్లు, నాయీ బ్రాహ్మణులు, రజకులకు ఏడాదికి రూ.10 వేల ప్రకారం ఐదేళ్ల వరకు ఆర్థిక సహకారం అందిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగానే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేదోడు పథకాన్ని ప్రవేశపెట్టి పక్కాగా అమలు చేస్తున్నారు. 2020 జూన్ 10వ తేదీన పథకాన్ని ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు ఎలాంటి ఆటంకం లేకుండా ఈ పథకం కింద నాలుగేళ్లుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ అవుతూనే ఉంది. దీంతో ఆయా చేతి వృత్తులపై ఆధారపడిన కుటుంబాలకు 'జగనన్న చేదోడు' ఒక వరంగా ఆదుకుంటోంది. చూడ్డానికి చిన్న మొత్తమే అయినా ... కుల వృత్తులపై ఆధారపడి జీవించే వారికి ఇది పెద్ద సాయమే. వృత్తులను అభివృద్ధి చేసుకునేందుకు, అవసరమైన ముడి సరుకును తెచ్చుకునేందుకు ప్రభుత్వ సాయం ఎంతో ఉపయోగపడుతుంది.

కరోనా కష్టకాలంలో కూడా ...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన సమయంలో ... రెండేళ్లు కరోనాతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కర్ఫ్యూ, లాక్‌డౌన్‌తో జనజీవనం స్తంభించిపోయింది. అలాంటి సయమంలో కూడా ప్రభుత్వం పథకం అమలులో ఎలాంటి వెనకడుగు వేయలేదు. చేతి వృత్తులు చేసుకునే వారికి ఎలాంటి ఇబ్బంది కలగరాదనే దృఢ సంకల్పంతో పథకంలో భాగంగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదును జమ చేసింది.

అభివృద్ధి దిశగా చేతి వృత్తులు ...

రాష్ట్ర ప్రభుత్వం రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లకు ఏడాదికి రూ.10 వేల ప్రకారం అందిస్తున్న ఆర్థిక సహాయంతో వారు చేతి వృత్తులను అభివృద్ధి చేసుకుంటున్నారు. రజకులు వారి కుల వృత్తికి అవసరమైన డ్రమ్ములు, ఇస్త్రీ పెట్టెలు, బొగ్గులు తదితర సామగ్రికి ఈ నగదును ఉపయోగించుకుంటున్నారు. టైలర్లు, నాయీ బ్రాహ్మణులు వారికి అవసరమైన మెటీరియల్‌ను కొనుగోలు చేసి షాపులను అభివృద్ధి పరచుకుంటున్నారు.

చేదోడు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



జగనన్న చేదోడు పథకాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని తమ వృత్తులను మెరుగుపరచుకోవాలి. ఈ పథకం కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాలుగు విడతల్లో 1,01,482 మంది లబ్ధిదారులకు రూ.101,48,20,000 జమ చేయడం జరిగింది. ప్రభుత్వం అందిస్తున్న రూ.10 వేలతో ఆదాయ వనరులను పెంచుకోవాలి. ఈ మొత్తం పెట్టుబడి అవసరాలు తీర్చేందుకు ఉపయోగించుకోవాలనే ప్రభుత్వం ఆశయాన్ని నెరవేర్చాలి.

– పి. వెంకటలక్ష్మమ్మ, ఈడీ, బీసీ కార్పొరేషన్

నాయీ బ్రాహ్మణులకు ప్రభుత్వం అండ



కుల వృత్తిపై ఆధారపడి జీవనం చేస్తున్న నాయీ బ్రాహ్మణులకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో అండగా నిలుస్తోంది. జగనన్న చేదోడు పథకం ద్వారా అందిస్తున్న రూ.10 వేలతో సేవింగ్ సెలూన్‌కు అవసరమైన ఫేషియల్స్ కాస్మోటిక్స్ తదితర మెటీరియల్‌ను కొనుగోలు చేసుకుంటున్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా మాకు ఆర్థికంగా ఆదుకోవాలని ఆలోచించ లేదు. చేదోడు పథకం వల్ల మా నాయీ బ్రాహ్మణులకు ఎంతో మేలు చేకూరుతోంది.

– స్వామి చంద్రుడు, నగర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కన్వీనర్

పేద రజకులకు ఎంతో ఉపయోగం



జగనన్న చేదోడు పథకంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న ఏడాదికి రూ.10 వేలు పేద రజకులకు ఎంతో ఉపయోగపడుతోంది. ఇళ్ల వద్ద, వేర్వేరు ప్రాంతాల్లో చిన్న చిన్న బంకులు పెట్టుకొని కుల వృత్తి చేసుకుంటున్న రజకులు అనేక మంది ఈ పథకం ద్వారా అందిన నగదుతో కొత్త ఇస్త్రీ పెట్టె, బొగ్గులు, డ్రమ్ములు కొనుగోలు చేసుకున్నారు. గతంలో మాదిరిగా అప్పులు చేసే తిప్పలు తప్పింది. రజకులను ఆదుకుంటున్న జగనన్నకు రుణ పడి ఉంటాం.

– బావనపల్లె భారతీ, రజక వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు

వైఎస్సార్‌సీపీ యువజన విభాగంలో జిల్లాకు చోటు



మధుసూదన్‌రెడ్డి బీఏకే పర్వేజ్ షేక్ రియాజ్

కర్నూలు (రాజ్‌విహార్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర కమిటీలో కర్నూలు జిల్లాకు చెందిన నాయకులకు చోటు దక్కింది. ఎం.మధుసూదన్‌రెడ్డిని జోనల్ ఇన్‌చార్జ్ (జోన్–7), బి.అబ్దుల్లా ఖాన్ పర్వేజ్ (బీఏకే పర్వేజ్) కార్యదర్శిగా, షేక్ రియాజ్ (రియాజ్ బాబా) సంయుక్త కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేసింది. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు యువజన విభాగం కమిటీలో చోటు కల్పించామని అందులో తెలిపారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడీ అమరనాథ్‌రెడ్డి

ఓర్వకల్లు: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకం కింద జగనన్న కాలనీల్లో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం హుసేనాపురం గ్రామంలోని జగనన్న కాలనీని ఆయన పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలపై ఆరా తీశారు. త్వరగా ఇళ్లను నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఏవైనా ఇబ్బందులుంటే తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి జగనన్న కాలనీలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఆయన వెంట ఈసీ మధు వెంకట కృష్ణ, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ .. ఒకరు మృతి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కర్నూల్ రోడ్డు హోటల్ గ్రాండ్ మా సమీపంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వాహనం స్కూటర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. వివరాలు.. ఎమ్మిగనూరు మండలం మాసుమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన వడ్డె రామాంజీ.. నందవరం మండలం గంగవరం చెందిన బంధువు వడ్డె రంగస్వామి(38) ఇద్దరు కలసి బైక్‌పై మదర్‌థెరిస్సా బీఈడీ కాలేజీ దగ్గర నుంచి ఎమ్మిగనూరు వైపు వస్తున్నారు. కర్నూల్ వైపు వెళ్తున్న గుర్తుతెలియన వాహనం బైక్‌ను ఢీ కొట్టడంతో వడ్డె రంగస్వామి తలపగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. వడ్డె రామాంజీకి గాయాలయ్యాయి. ప్రమాద విషయం తెలుసుకున్న రూరల్ ఎస్‌ఐ సి.శరత్‌కుమార్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. గాయపడ్డ వ్యక్తిని చికిత్స కోసం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు. మృతుడు రంగస్వామికి 8 నెలల క్రితమే వివాహమైనట్లు బంధువులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్‌ఐ విలేకరులకు తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

నందవరం: మండల పరిధిలోని ముగతి గ్రామ పరిధిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ మహేష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు..ఎమ్మిగనూరు టౌన్ సమీపంలో కోసిగి రోడ్డులో సోమవారం రాత్రి గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి మహిళ మృతదేహంగా గుర్తించారు. మృతురాలి కుడి చేతికి అమ్మ, హైమావతి, ఏసయ్య అనే తెలుగు అక్షరాలతో పచ్చబొట్లు ఉన్నాయి. ముగతి వీఆర్వో చంద్రశేఖర్ గౌడ్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలి సమాచారం తెలిసిన వారు సెల్: 91211 01150 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

ముమ్మరంగా వరి కోతలు

గడివేముల: మండలంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. పెసరవాయి, కరిమద్దెల, చిందుకూరు, బూజునూరు, మంచాలకట్ట, దుర్వేశి, గడిగరేవుల గ్రామాలలో అధికంగా వరి సాగు చేశారు. విత్తు వేసినప్పటి నుంచి రైతన్నలు చీడపీడలు, తెగుళ్లు, ప్రకృతి వైపరీత్యాలకు ఎదురొడ్డి పైరును కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారు. బోర్లలో, కేసీ కెనాల్, తెలుగుగంగకు నీరు ఉండటంతో వారి కష్టానికి ఫలితంగా వరి కాపు బాగా కాసింది. పంట పక్వానికి రావడంతో మండలంలోని రైతులు కోతల్లో బిజీగా ఉన్నారు. ఎకరాకు దాదాపు 30 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వస్తోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కత్తితో బెదిరించి దోపిడీ

మహానంది: నంద్యాల – మహానంది రహదారిలో గుర్తు తెలియని దుండగులు దోపిడీకి పాల్పడ్డారు. సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన జరగగా ఆలస్యంగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు విజయవాడ నుంచి ఇద్దరు మహిళలు మహానందిలోని బంధువులు ఇంట్లో జరిగే శుభకార్యానికి వచ్చేందుకు నంద్యాల రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి ఆటోలో బయలుదేరగా సుగాలిమెట్ట సమీపంలో ఆటో మరమ్మతులకు గురికావడంతో డ్రైవర్ పుల్లయ్య గమనించి నిలిపాడు. అదే సమయంలో ఇద్దరు గుర్తు తెలియని ఆటోడ్రైవర్ తలపై కర్రతో కొట్టడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. ఆటోలో ఉన్న ఓ మహిళను కత్తితో బెదిరించి సమీపంలోని పొలాల్లోకి తీసుకెళ్లారు. ఆమె వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్లు, కమ్మలు, వెండి పట్టీలు, సుమారు రూ. పదివేలు నగదు తీసుకున్నారు. స్పృహ వచ్చిన డ్రైవర్ వెంటనే అక్కడి నుంచి తేరుకుని తమ్మడపల్లె వరకు పరిగెత్తుకుంటూ వచ్చి అక్కడ ఉన్న స్థానికులకు విషయం తెలుపగా అందరూ కలిసి ఘటనా స్థలానికి వెళ్లారు. అప్పటికే గుర్తించిన దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో బాధితులు నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.



గడివేముల: పంట పొలాల్లో రైతు నేస్తాలు సందడి చేస్తున్నాయి. రైతులు రబీ సీజన్‌కు పొలాలను దున్ని సాగుకు సిద్ధం చేసుకుంటున్న సమయంలో తెల్లటి కొంగలు గుంపులు గుంపులుగా చేరి ఆహారం కోసం అన్వేసిస్తున్నాయి. పొలంలోని పురుగులను తినేస్తూ వాటి ఆకలిని తీర్చుకుంటూ రైతులకు నేస్తాలుగా మారాయి. ఈ దృశ్యం మంగళవారం గడివేముల మండలంలోని పెసరవాయి గ్రామంలో కనిపించింది.

శివ కేశవులకు అభిషేకాలు ప్రీతికరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జ్వాలాపురం శ్రీకాంత్

కర్నూలు(అర్బన్): కార్తీక మాసంలో శివ కేశవులకు అభిషేకాలు ప్రీతికరమని రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ అన్నారు. ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు సందేల్ చంద్రశేఖర్ అధ్యక్షతన స్థానిక దేవీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం రాత్రి కార్తీక మాస సమారాధన సత్సంగ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జ్వాలాపురం శ్రీకాంత్ మాట్లాడుతూ అర్చకుల సమస్యలతో పాటు కర్నూలు బ్రాహ్మణ భవన నిర్మాణం తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు వెళ్ళాల మధుసూధనశర్మ, హైదరాబాద్ బ్రాహ్మణ సంక్షేమ వేదిక నాయకులు బాలా శ్రీనివాస్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో బ్రాహ్మణుల్లో స్నేహభావం, ఐక్యత బలపడుతుందన్నారు. ఉపాధ్యక్షులు సందేల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి ఆధ్వర్యంలో కర్నూలులో నారాయణ అన్న ప్రసాద వితరణ పథకం అమలు చేస్తున్నట్లు చెప్పారు. బ్రాహ్మణ కుటుంబంలో ఎవరైనా మరణిస్తే వారి దహన సంస్కారాల రోజు 50 భోజనాలను ఉచితంగా ఏర్పాటు చేయడం ఈ పథకం ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్యాంసుందర్‌రావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగులవరం రాజశేఖర్, చల్లా నాగరాజశర్మ, కోశాధికారి ఆకెళ్ల రాధాక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తజన సందడి

ఓర్వకల్లు: మండలంలోని కొమ్మచెరువు ఆంజనేయస్వామి, బొడ్డువానిపల్లె వీరాంజనేయస్వామి, కాల్వ కోనేటి ఆంజనేయస్వామి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక మాసం తర్వాత వచ్చిన తొలి అమవాస్య కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆంజనేయుడిని దర్శించుకుని సింధూర అలంకరణ, ఆకు పూజలు, అన్నప్రసాద వితరణ చేశారు.

కాల్వలో లక్ష దీపోత్సవం

కార్తీక మాసం ముగింపు సందర్భంగా కాల్వ గ్రామం వద్ద వెలసిన కోనేటి ఆంజనేయస్వామి ఆలయం వద్ద లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. 100 జంటలు పాల్గొని దీపాలు వెలిగించారు. జ్వాలాతోరణం, సింధూర పూజ అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. లక్ష దీపోత్సవం కార్యక్రమంలో కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ విజయమనోహరి, డ్వామా అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ మాధవీలత, ఎంపీడీఓ శివనాగప్రసాద్ దంపతులు పాల్గొని స్వాముల వారికి ప్రత్యేక పూజలు చేశారు.

శివరాత్రి, ఉగాది ఉత్సవాలకు రూ. 10.53 కోట్లు



ధర్మకర్తల మండలి సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్, ఈఓ

- రూ.52 కోట్లతో భక్తుల సౌకర్యార్థం 200 గదుల వసతి నిర్మాణం
- ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు ఫ్లైవర్ బ్రిడ్జి ఏర్పాటుకు ప్రతిపాదన
- శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి

శ్రీశైలంటెంపుల్: వచ్చే ఏడాది శ్రీశైల క్షేత్రంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు, ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని రూ.10.53 కోట్ల అంచనా వ్యయంతో 82 సివిల్, ఎలక్ట్రికల్, జనరల్ పనులు చేయుటకు ధర్మకర్తల మండలి ఆమోదం తెలిపినట్లు ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి తెలిపారు. మంగళవారం దేవస్థాన పరిపాలన భవనంలో ట్రస్ట్‌బోర్డు చైర్మన్ అధ్యక్షతన ధర్మకర్తల మండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మొత్తం 30 అంశాలు అజెండాగా చర్చించగా 28 అంశాలకు ట్రస్ట్‌బోర్డు ఆమోదించింది. ఒక అంశం వాయిదా వేయగా, మరో అంశాన్ని తిరస్కరించారు. ఈ సమావేశంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు మఠం విరూపాక్షయ్యస్వామి, జి.నరసింహారెడ్డి, ఎం.విజయలక్ష్మి, బి.రామేశ్వరి, అంబాల లక్ష్మీసావిత్రమ్మ, ఎ.మురళి, మేరాజోత్ హనుమంత్‌నాయక్, ఓ.మధుసూదన్‌రెడ్డి, డా.సి.కనకదుర్గ, ప్రత్యేక ఆహ్వానితులు తన్నీరు ధర్మరాజు, దేవస్థానం అన్ని యూనిట్ విభాగాల అధికారులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ఆమోదించిన అంశాలు

➤ భక్తుల వసతి సౌకర్యార్థం గణేశ సదనం సమీపంలో తలపెట్టిన 200 గదుల వసతి సముదాయ నిర్మాణానికి రూ.52 కోట్లు కేటాయింపు.
➤ రూ.39 లక్షల అంచనా వ్యయంతో శిఖరేశ్వరస్వామి ఆలయ ప్రహరీ ఎత్తు పెంచి బండపరుపు, ఇతర అభివృద్ధి పనులు.
➤ రూ.10 లక్షలతో శిఖరేశ్వరం ఆలయం వద్ద ఆర్చ్ గేట్ నిర్మించి కాంక్రీట్ రోడ్డు.
➤ రూ.38.50 లక్షల వ్యయంతో క్షేత్రపరిధిలో ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలను అధిగమించేందుకు టోల్‌గేట్, నందిసర్కిల్ వద్ద ఫీకాస్ట్ సెంటర్ డివైడర్లు ఏర్పాటు.
➤ రూ.15.50 లక్షలతో సిద్ధిరామప్ప మూల జంక్షన్ వద్ద రహదారిని విస్తరణ.
➤ రూ.13 లక్షలతో కల్యాణ కట్టలో పలు మరమ్మతులు, అభివృద్ధి పనులు.
➤ క్షేత్ర ప్రచారంలో భాగంగా స్థలపురాణం, చరిత్ర, క్షేత్ర ప్రత్యేకతలు మొదలైన అంశాలు పొందుపరుస్తూ ఆయా చిత్రాలతో కాఫీటేబుల్ పుస్తకం ప్రచురణ.
➤ ఉత్సవాల సమయంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు రాజుల సత్రం నుంచి సిద్ధరామప్ప కొలను వరకు బ్రిడ్జి నిర్మించాలన్న ప్రతిపాదనకు ట్రస్ట్‌బోర్డు ఆమోదం.
➤ మల్లికార్జున సదన్ నుంచి టోల్‌గేట్ వరకు, టోల్‌గేట్ నుంచి రామయ్య టర్నింగ్ వరకు ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఏర్పాటుకు ప్రతిపాదనలు.

క్లుప్తంగా

టీకాలు వందశాతం వేయాలి


గోవిందపల్లెలో టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మానిటరీ అధికారి

శిరివెళ్ల: వ్యాధి నిరోధక టీకాలు వంద శాతం పూర్తి చేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ మిషన్ ఇంద్రధనస్సు మానిటరింగ్ అధికారి డాక్టర్ రవికాంత్ అన్నారు. మంగళ వారం శిరివెళ్ల, గోవిందపల్లెలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఏడాదికి సగటున 26 లక్షల మంది పిల్లలకు ఉచితంగా వ్యాక్సిన్ అందిస్తున్నామన్నారు. వ్యాక్సిన్ వలన 12 రకాల ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడ వచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దివ్య, సీహెచ్ఓ రాంమోహన్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ విద్య అందించాలన్నదే ధ్యేయం


శిరివెళ్లలో ప్రచార ఆటోను ప్రారంభిస్తున్న ఎంపీపీ

శిరివెళ్ల: బడిఈడు పిల్లలందరికీ విద్యనందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ నాయక్ వసీం అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రచార ఆటోను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అందరికీ విద్యలో భాగంగా బడిఈడు పిల్లలు బడిలో ఉండాలని, చేరిన ప్రతి విద్యార్థి తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. అనంతరం లేబర్ ఆఫీసర్ మరళీకృష్ణ మాట్లాడుతూ పిల్లలను హోటల్, అంగళ్లలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వారికి నోటీసులు జారీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఎంఈఓలు శంకర్‌ప్రసాదు, నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

దొర్నిపాడు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుక వచ్చిన సంక్షేమ పథకాలతో పేద కుటుంబాలు ఆర్థికాభివృద్ధిలో పయనిస్తున్నాయని ఎంపీడీఓ సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో గ్రామ సర్పంచ్ శివరామిరెడ్డి అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులకు పీఎం కిసాన్, ఆయుస్మాన్ భారత్, అటల్ పెన్షన్ యోజన, పీఎంజేవై, పీఎం ఆవాస్ యోజన్, పొదుపు రుణాలు, తదితర పథకాలను ఎల్ఈడీ టీవీ ద్వారా వివరించారు. స్థానిక ఎంపీడీ యూపీ పాఠశాల బాలికల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహేష్, సచివాలయ కన్వీనర్ శివశంకర్‌రెడ్డి, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, ఏఓ సునీత పాల్గొన్నారు.

ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు


వార్డుకు పోదాం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నంద్యాల(సిటీ): ప్రజలందరికీ సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందిస్తున్నామని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు అన్నారు. పట్టణంలోని 39వ వార్డు రోజా కుంటలో వార్డు కౌన్సిలర్ గొల్ల వెంకటలక్ష్మి, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గొల్ల లక్ష్మీనారాయణల ఆధ్వర్యంలో వార్డుకు పోదాం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముందుగా వార్డులో గత నాలుగున్నరేళ్లలో జరిగిన సంక్షేమాభివృద్ధికి సంబంధించిన డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. అభివృద్ధితో పాటు డీబీటీ, నాన్ డీబీటీ రూపంలో 39వ వార్డుకే రూ.17.79కోట్ల మేర లబ్ధి చేకూరిందని తెలిపారు.

ఆర్‌జేయూపీ ప్రధాన కార్యదర్శిగా షరీఫ్



నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నంద్యాల జిల్లాకు చెందిన షేక్ మహబూబ్ షరీఫ్‌ను ఎన్నుకున్నట్లు ముఖ్య సలహాదారు శ్రీముత్తోజీ వీరబ్రహ్మం మంగళవారం తెలిపారు. కడపలో జరిగిన రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయనను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అలాగే అన్నెం శ్రీనివాసరెడ్డిని కార్యదర్శిగా, శేషఫణి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, మహిళా కార్యదర్శిగా స్వయంప్రభ ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

ఆక్రమిత వక్ఫ్ ఆస్తులపై విచారణ జరపాలి

నంద్యాల(అర్బన్): రైతునగరం సమీపంలోని వక్ఫ్ బోర్డుకు సంబంధించిన ఏడు ఎకరాల ఆక్రమిత భూములపై విచారణ జరపాలని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. వక్ఫ్‌బోర్డు స్థలాలు అన్యాక్రాంతమవుతున్న సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక అమావాస్య పూజలు

- శైవాలయాలకు పోటెత్తిన భక్తులు
- స్వామివారికి పూజలు, అభిషేకాలు

నంద్యాల(వ్యవసాయం): కార్తీక మాసం చివరి రోజు మంగళవారం అమావాస్యను పురస్కరించుకొని పట్టణంలోని పలు శైవాలయాలకు భక్తులు తెల్లవారు జాము నుంచే పోటెత్తారు. స్వామివారికి పంచామృతాభిషేకాలు, మహన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకాలు, అన్నాభిషేకం, లక్షబిల్వార్చన పూజలు, కల్యాణాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ప్రదోషకాల పూజలు నిర్వహించి స్వామి వారికి నాగాభరణాన్ని అలంకరించి పూలంగిసేవ కార్యక్రమాన్ని నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. అదే విధంగా సాయంత్రం ఆకాశ దీపాన్ని వెలిగించారు.

- ప్రథమనంది ఆలయంలో తెల్లవారుజాము నుంచే స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకాలు, నమకం, చమకం పూజలు చేసి, స్వామి వారికి ప్రత్యేక అలంకారంలో పూలంగిసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం ప్రథమనందీశ్వర స్వామి, కేదారేశ్వరి దేవి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించి దేవాలయం ఆవరణంలో రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.
- కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో కార్తీక అమావాస్యను పురస్కరించుకొని స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించిన అనంతరం అన్నాభిషేకం, లక్షబిల్వార్చన చేపట్టారు.
- రమాసమేత సత్యనారాయణస్వామి దేవస్థానంలో కాశీవిశ్వనాథుడికి క్షీరాభిషేకం నిర్వహించి స్వామి వారికి లక్షబిల్వార్చన పూజా కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక విశ్వనగర్‌లోని గాయత్రీమాత ఆలయంలో మట్టి శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించి లక్షబిల్వార్చన చేశారు.
- నాగులకుంట రోడ్డులోని నాగలింగేశ్వర ఆలయంలో నాగలింగేశ్వరస్వామికి ఉదయాన్నే పంచామృతాభిషేకాలు, మహన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకం, నమ్మకం, చమకం, రుద్రం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని ప్రత్యేకంగా నాగాభరణం అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు.
- స్థానిక టెక్కెలోని నాగులకట్టలో వెలసిన అభయాంజనేయస్వామికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సింధూరాభిషేకం నిర్వహించి స్వామి వారికి తమలపాకులు, జిల్లేడు ఆకులచే, వడమాలలు అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు.


పూలంగిసేవలో ప్రథమనందీశ్వరుడు,


విశ్వనగర్ గాయత్రీ ఆలయంలో మట్టి లింగానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కమనీయం.. కల్యాణోత్సవం

పట్టణంలోని బైర్మల్‌వీధిలో వెలసిన శ్రీబసవేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం కార్తీక అమావాస్యను పురస్కరించుకొని శ్రీపార్వతీ, పరమేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా బసవేశ్వర మూలవిరాట్‌కు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పార్వతీ, పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలచే అలంకరించి శాస్త్రోక్తంగా వేదమంత్రాల సాక్షిగా శశిభూషణ్ సిద్ధాంతి ఆధ్వర్యంలో కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు.


ప్రత్యేక అలంకారంలో కాశీవిశ్వనాథుడు


కాళికాంబ చంద్రశేఖరస్వామికి అన్నాభిషేకం నిర్వహించిన దృశ్యం


పార్వతీపరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

కల్యాణ పెద్దలుగా బద్రిశెట్టి అమర్నాథ్ దంపతులు, శివానంద దంపతులు వ్యవహరించారు. సాయంత్రం పార్వతీపరమేశ్వరులను నందికోల ఉత్సవంతో గ్రామోత్సవం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో అష్టాదశ పాద పద్మారాధన సేవ

పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో కార్తీక అమావాస్యను పురస్కరించుకొని అమ్మవారికి అష్టాదశ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. 108 వెండి పుష్పాలచే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం చేపట్టారు. అమ్మవారికి చీర, ఒడి బియ్యం సమర్పించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్రాచారి, సుబ్బాచారి, అరవేటి వాసు పాల్గొన్నారు.

ముగిసిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలు

నంద్యాల(అర్బన్): మండల గ్రామాల్లో ఈనెల 4న ప్రారంభమైన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాలు ముగిశాయి. పోలూరులో ప్రారంభమైన యాత్ర మంగళవారం భీమవరం, కొత్తపల్లె గ్రామాల్లో జరిగిన కార్యక్రమాలతో ముగిసింది. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యూట్రిషన్ స్టాల్, వైద్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పలువురికి ఆయూష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు. అలాగే వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై రైతులకు ప్రదర్శన నిర్వహించారు. గ్రామ సర్పంచ్‌లు భక్తవత్సలమ్మ, నారాయణ, ఎంపీడీఓ సుగుణశ్రీ, ఈఓఆర్డీ మహిధర్‌రెడ్డి, వ్యవసాయాధికారి ప్రసాదరావు, ఏఈఓ ఏర్వ మణిమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అంగన్‌వాడీ వర్కర్ల ధర్నా

నంద్యాల(న్యూటౌన్): అంగన్‌వాడీలకు వేతనాల పెంపు, గ్రాట్యూటీ అమలు కోసం నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, గౌస్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మల, అర్బన్ ప్రాజెక్టు కార్యదర్శి సునిత పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు సున్నా నుండి ఆరు సంవత్సరాల్లోపు పిల్లలకు అంగన్‌వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లు అనేక సేవలు అందిస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి వేతనాలు పెంచాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

రుద్రవరం: తమ సమస్యలు పరిష్కరించాలని మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది నిరసన తెలిపారు. స్థానిక భాస్కర నందీశ్వర స్వామి ఆలయం నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ బైఠాయించారు. బీబీ, పద్మ, మనోజ, తిరుపాలమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల డిమాండ్లు పరిష్కరించాలి

ఉయ్యాలవాడ: అంగన్‌వాడీ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట కార్యకర్తలు, ఆయాలు నిరవధిక సమ్మెకు దిగారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ తులసీకృష్ణకు అందజేశారు.

ఉర్దూను రెండో అధికార భాషగా చేయడం హర్షణీయం


ఇబ్రహీంను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): ఆంధ్ర రాష్ట్రంలో ఉర్దూను రెండో అధికార భాషగా ప్రభుత్వం అమలు చేయడం హర్షణీయమని ఏపీ ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ ఎస్ఎండీ నౌమాన్ అన్నారు. స్థానిక ముల్లాన్‌పేట ఉర్దూ పాఠశాలలో మంగళవారం భారతదేశ భాషా వారోత్సవాల ముగింపు కార్యక్రమం హెచ్ఎం షమీమ్‌బేగం అధ్యక్షతన నిర్వహించారు. ఆల్‌మదద్ ఫౌండేషన్ చైర్మన్ ఆకుమల్ల రహీం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నౌమాన్ మాట్లాడుతూ ఉర్దూ భాషాభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఈ సందర్భంగా ఉర్దూ భాషాభివృద్ధికి, 37ఏళ్ల పాటు కృషి చేసిన నందమూరినగర్ ఎయిడెడ్ ఉర్దూ పాఠశాల హెచ్ఎం ఇబ్రహీంను ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు జమియతే ఉల్మా నంద్యాల జిల్లా అధ్యక్షుడు మౌలానా ఖలీల్ అహమ్మద్, ఏపీ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అబ్దుల్‌అజీజ్, సభ్యులు రహంతుల్లా, అబ్దుల్‌మజీద్ మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'నవరత్నాలు'

శిరివెళ్ల: అర్హులందరికీ నవరత్నాలు అందుతున్నాయని ఎంపీపీ నాయక్ వసీం అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ కుల, మత, రాజకీయాలకు అతీతంగా పథకాలు అందజేస్తున్నామన్నారు. గ్రామాలలో ఇంకా అర్హులై ఉండి పథకాలు రానివారుంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులున్నప్పటికీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సహకారంతో పంటలను సాగునీరు అందిందన్నారు. రానున్న వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వంద శాతం పక్కా గృహాల నిర్మాణాలు జరగాలని, లబ్ధిదారులను ఆ దిశగా ప్రోత్సహించాలన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు తమ పరిధిలోని ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌బేగం, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ షేక్ మొయిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ నాయక్ వసీం

విద్యాలయాల వద్ద పొగాకు ఉత్పత్తులు అమ్మితే చర్యలు


పోస్టర్ విడుదల చేస్తున్న ఏఎస్పీ వెంకటరాముడు, అధికారులు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల వద్ద పొగాకు ఉత్పత్తులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు హెచ్చరించారు. మంగళవారం పట్టణ సమీపంలోని ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో పొగాకు ఉత్పత్తుల చట్టం, నియంత్రణ కార్యక్రమం, రాష్ట్ర ప్రజా ఆరోగ్య శాఖ సంబంధ్ హెల్త్ ఫౌండేషన్ సహకారంతో జిల్లాలోని పోలీసులందరికీ సమగ్ర శిక్షణ నిర్వహించారు. పోలీసులు అధికారులందరూ పొగాకు వ్యతిరేకంగా పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఏఎస్పీ మాట్లాడుతూ పిల్లల్ని పొగాకు బానిస కాకుండా రక్షించడం, పొగాకు ఉత్పత్తులకు అలవాటు కాకుండా నిరోధించడం మన కర్తవ్యమన్నారు. అనంతరం క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ విజయానందరెడ్డి మాట్లాడుతూ 90శాతం పొగాకు వల్ల ఊపిరితిత్తులు చెడిపోయి క్యాన్సర్ రోగాలు వస్తున్నాయన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, డీఎస్పీ మహేశ్వర రెడ్డి, జిల్లా టోబాకో అధికారి కేవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో ఇంటర్, డిగ్రీ, పీజీ చదువుకుంటున్న విద్యార్థులకు మంగళవారం సొసైటీ ఫర్ రూరల్ ఎడ్యుకేషన్ ఎంపవర్‌మెంట్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లేట్లు, గ్లాసులు జిల్లా ఎస్సీ సోషల్ వెల్ఫేర్ అధికారి చింతామణి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ప్రొఫెసర్ రవికుమార్ ఆర్థిక సహాయంతో తల్లిదండ్రులు లక్ష్మీదేవి, గంగన్న జ్ఞాపకార్థం వీటిని అందజేసినట్లు ఎస్‌డబ్ల్యూఓ వార్డెన్ బండారి వెంకటేష్ తెలిపారు. ఆ సంస్థ డైరెక్టర్ కొమ్ముపాలెం శ్రీనివాస్, శ్రీనివాసులు, మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

షరతులు తొలగించాలి

నంద్యాల(వ్యవసాయం): దివ్యాంగులకు నెలసరి ఇచ్చే పెన్షన్ విధానంలో షరతులు తొలగించాలని సక్షమ్ దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నెట్ల మహేశ్వరరెడ్డి కోరారు. స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల కుటుంబాల్లో ఆస్తులు ఉండటం, వారి కుటుంబ సభ్యులు ఉద్యోగం కలిగి ఉండటం, ఇన్‌కమ్‌ట్యాక్స్, కరెంట్ బిల్లులు ఎక్కువ వస్తున్న కారణంగా పెన్షన్‌ను తొలగించడం జరుగుతుందన్నారు. దివ్యాంగులకు ఎటువంటి షరతులు లేకుండా పెన్షన్‌ను అందించాలన్నారు.

- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- వెంకటాపురం, యర్రగుంట్లలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

మాది చేతల ప్రభుత్వం


వెంకటాపురంలో లబ్ధిదారులకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

శిరివెళ్ల: మాది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. మంగళవారం యర్రగుంట్ల గ్రామ సచివాలయ పరిధిలోని వెంకటాపురం, యర్రగుంట్లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని చదివి వినిపించారు. ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలలో 98 శాతం అమలు పరిచామన్నారు. అర్హులైన వారందరికీ పథకాలు అందేలా సీఎం వైఎస్ జగనన్న ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. అయితే టీడీపీ అందుకు విరుద్ధంగా హామీలను తుంగలో తొక్కిందని విమర్శించారు. ఎన్నికల ముందు ఒకలా, ఎన్నికలు అయిపోయి గెలిచిన తర్వాత మరోలా వ్యవహరించిందని గుర్తుచేశారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కడం బాబు నైజమన్నారు.

రూ. 56 కోట్లతో రోడ్ల నిర్మాణం..

ఆళ్లగడ్డ నియోజక వర్గంలో ఈ నాలుగేళ్లలో రూ. 56 కోట్లతో మండల, గ్రామీణ రోడ్ల నిర్మాణాలు జరిగాయని ఎమ్మెల్యే తెలిపారు. మరో రూ. 40 కోట్ల నిధులతో రోడ్ల నిర్మాణాలు టెండర్లు ప్రక్రియలో ఉన్నాయన్నారు. ఇంత వరకూ నియోజక వర్గంలో ఉన్న 91 గ్రామ సచివాలయాలలో 95 శాతం సచివాలయాలలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం పూర్తియిందని తెలిపారు. ఆయా సచివాలయాలలో ప్రజల కోరిక మేరకు సిమెంట్ రోడ్లు, మురుగు కాల్వలు, విద్యుత్ సదుపాయాల వంటి పనులు చేరుకుగా సాగుతున్నాయని చెప్పారు. అయితే అభివృద్ధిపై టీడీపీ నాయకులు అవాకు చేవాకులు పేలుస్తున్నారని, వారి హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో ప్రజలకు చెప్పాలన్నారు. మంత్రి హోదాలో ఉన్న భూమా అఖిలప్రియ నియోజక వర్గానికి చేసింది శూన్యమన్నారు. ఈ ప్రభుత్వం వలన మేలు జరిగింటే మళ్లీ ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌బేగం, ఎంపీపీ నాయక్ వసీం, వైఎస్సార్‌సీపీ జిల్లా, మండల అధ్యక్షులు బీ.అబ్దుల్ సలాం, ఇందూరి ప్రతాపరెడ్డి, సర్పంచులు కందుల మల్లేశ్వరి, అయ్యలూరి సుభాహన్, నాయకులు ప్రసాదరెడ్డి, తిరుపతిరెడ్డి, రమణారెడ్డి, ప్రతాపరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అహో బలం' సినిమా చిత్రీకరణ

రుద్రవరం: మండలంలోని నర్సాపురం మెట్టపై మంగళవారం అహో బలం సినిమాకు సంబంధించిన సన్నివేశాలను చిత్రీకరించారు. దర్శకుడు జగదీష్ తెలిపిన వివరాల మేరకు గతంలో సినిమాకు సంబంధించి పలు సన్నివేశాలు చిత్రీకరించారు. అయితే అనివార్య కారణాల వల్ల అప్పట్లో సినిమా పనులు నిలిచాయి. ప్రస్తుతం సినిమా సన్నివేశాల చిత్రీకరణ పనులు మళ్లీ ప్రారంభించారు. పది రోజుల పాటు నర్సాపురం, ముత్తలూరు, హరినగరం గ్రామాలతో పాటు అహోబిలం పరిధిలో చిత్రీకరణ చేయనున్నారు. సినిమాలో హీరోగా నరేష్, హీరోయిన్‌గా శివాణిమహి నటిస్తున్నారని దర్శకుడు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

నంద్యాలటౌన్: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నంద్యాల డిపో మేనేజర్ గంగాధరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సెల్ నెం. 99592 25800కు ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య ప్రయాణికులు ఫోన్ చేసి సమస్యలు, సూచనలు, సలహాలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

చాగలమర్రి: గ్రామ, వార్డు సచివాలయాలలో పని చేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని ఎనర్జీ అసిస్టెంట్ల సంఘం నాయకులు సాంబయ్య, దస్తగిరి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం, విద్యుత్తు సబ్-స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీఓ మహబుబ్‌దౌలా, విద్యుత్ ఏఈ షాజహాన్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో మండల ఎనర్జీ అసిస్టెంట్లు గౌడ్, హుసేన్‌బాషా, వెంకటేష్, కృష్ణానాయక్, సురేష్ పాల్గొన్నారు.

గ్రామీణ తపాలా ఉద్యోగుల ధర్నా

నంద్యాల(వ్యవసాయం): ఆర్ఎస్ రోడ్డులోని సబ్ పోస్టాఫీసులో మంగళవారం గ్రామీణ తపాలా ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మద్రెడ్డి, డివిజన్ కార్యదర్శి జమాల్‌బాషా మాట్లాడుతూ గ్రామీణ తపాలా ఉద్యోగులకు 8గంటల పనితో పాటు అన్ని ప్రయోజనాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో జయన్న, శశికుమార్, విజయలక్ష్మి, రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి

నంద్యాల(న్యూటౌన్): బడిఈడు పిల్లలను పాఠశాల్లో చేర్పించేలా చూడాలని ఎంఈఓ అబ్దుల్‌కరీం, ఇన్‌చార్జి ఎంపీడీఓ అనసూయ అన్నారు. మంగళవారం ప్రత్యేకంగా ఆటో ద్వారా బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించేలా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

బాధ్యతగా ఎన్నికల విధులు నిర్వహించండి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని నోడల్ అధికారుల బృందాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎన్నికల నిర్వహణపై నోడల్ అధికారులు, సెక్టోరల్ అధికారులు, పోలీసు సెక్టోరల్ అధికారులు, అన్ని మండలాల తహసీల్దారులు, సంబంధిత అధికారులతో జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు నోడల్ బృందాలు ఏర్పాటు చేశామన్నారు. సందేహాలకు తావివ్వకుండా ఎన్నికల సంఘం అందించిన హ్యాండ్ బుక్కులను క్షుణ్ణంగా చదివి ఆ మేరకు ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అధికారులు తమ విధుల పట్ల అప్రమత్తంగా ఉండి.. పోలింగ్ కేంద్రాలలో గ్రౌండ్ లెవెల్ నుండి అన్ని విషయాలను క్షుణ్ణంగా గమనిస్తూ ఉండాలన్నారు. ఆయా గ్రామాల్లో శాంతి భద్రతల విషయమై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, డీఆర్ఓ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకే క్రీడలు


క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్న ఎంపీపీ వీరభద్రుడు, ఎంపీడీఓ మహబూబ్‌దౌలా

చాగలమర్రి: గ్రామీణా స్థాయిలో వివిధ అంశాల క్రీడలలో ప్రావీణ్యం ఉన్న వారిని వెలికితీసి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకే ప్రభుత్వం ఆడుదాం-ఆంధ్ర క్రీడలను నిర్వహిస్తోందని ఎంపీపీ వీరభదుడు అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మహబూబ్‌దౌలా ఆధ్వర్యంలో మండలంలోని 17 సచివాలయాలకు క్రీడా సామగ్రిని సచివాలయ కార్యదర్శులకు అందజేశారు. ఒక్కో సచివాలయానికి ఒక్కో క్రీడాంశానికి సంబంధించి 3 కిట్‌ల చొప్పున మొత్తం 14 కిట్‌లను పంపిణీ చేశారు. మండలంలోని 17 సచివాలయాల పరిధిలో 2,867 మంది క్రీడాకారులు పోటీలో పాల్గొనేందికు తమ పేర్లను నమోదు చేసుకున్నారని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందయ్య, ఇన్‌చార్జ్ ఈఓ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేయండి

నంద్యాల(అర్బన్): గ్రామీణ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీపీ ప్రభాకర్, డీఎల్‌డీఓ మురళీ కల్యాణి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు ఈనెల 15 నుంచి గ్రామాల్లో నిర్వహించే క్రీడా పోటీలకు సంబంధించిన పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుగుణశ్రీ, ఎంఈఓ బ్రహ్మంనాయక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహానంది.. భక్తజనసంద్రం


మహానందిలో శాంతి కల్యాణోత్సవ పూజలు

మహానంది: కార్తీక మాసం, అమావాస్య సందర్భంగా మంగళవారం మహానంది ఆలయం భక్తులతో సందడిగా కనిపించింది. వేకువజామున ప్రారంభమైన శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారి దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ ఈఓ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు దర్శనం కొనసాగింది. భక్తులు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. ఆర్జిత సేవా టికెట్లు, ప్రసాదాల విక్ర యాలు, వసతి గహాలు, తదితర విభాగాల ద్వారా ఒకేరోజు ఆలయానికి సుమారు రూ.15 లక్షల వరకు ఆదాయం సమకూరినట్లు సమాచారం.

కామేశ్వరీ అమ్మవారికి లక్ష కుంకుమార్చన

కామేశ్వరీ అమ్మవారికి లక్ష కుంకుమార్చన వైభవంగా జరిగింది. నంద్యాలకు చెందిన డాక్టర్ రామకృష్ణారెడ్డి ,ఈఓ కాపు చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు ఉదయం నుంచి అమ్మవారికి లక్ష కుంకుమార్చన, వేదశాస్త్ర సమర్పణము, నీరాజన మంత్రపుష్పం నిర్వహించారు.

పూర్ణాహుతితో ముగిసిన కార్తీకమాసోత్సవాలు

మహానందిలో నెల రోజుల పాటు జరిగిన కార్తీక మాసోత్సవాలు ముగిశాయి. ఈ మేరకు స్థానిక యాగశాలలో మహాపూర్ణాహుతి పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి స్థానిక అలంకార మండపంలో శ్రీగంగా,కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లకు శాంతి కళ్యాణం శాస్త్రోక్తంగా చేశారు.